# రైతుల ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదు

- రుణమాఫీ చేశారా? ఐదొందల బోనస్ ఇచ్చారా?
- ఎంపీ ఎన్నికల తర్వాత బీజేపీలోకి రేవంత్ జంప్
- మల్కాజిగిరి నియోజకవర్గ సమావేశంలో కేటీఆర్

మేడ్చల్, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీకి రైతుల ఓట్లు అడిగే హక్కు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీని నెరవేర్చారా? క్వింటాకు రూ.500 బోనస్ అమలు చేశారా? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రైతులు తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలో మల్కాజిగిరి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల తరువాత బీజేపీలోకి వెళ్లే మొదటి జంప్‌జిలానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రధాని మోదీని చౌకీదార్ అంటుంటే, రేవంత్‌రెడ్డి మాత్రం బడా భాయ్ అంటున్నారని దుయ్యబట్టారు. అదానీ ఫ్రాడ్ అని రాహుల్ అంటుంటే, రేవంత్‌రెడ్డి మాత్రం అలయ్ బలయ్ చేసుకుంటున్నారని విమర్శించారు. లిక్కర్‌స్కామ్ లేదని రాహుల్ అంటుంటే, రేవంత్‌రెడ్డి మాత్రం లిక్కర్‌స్కామ్ ఉన్నదని చెప్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను గుజరాత్ మాడల్ చేస్తామంటున్న రేవంత్ వైఖరి చూస్తుంటే ఆయన రాహుల్‌గాంధీ కోసం పనిచేస్తున్నాడా? మోదీ కోసం పనిచేస్తున్నాడా? అనే అనుమానం కలుగుతున్నదని చెప్పారు.

### మందికి పుట్టిన బిడ్డలను తన బిడ్డలుగా..

మందికి పుట్టిన బిడ్డలను తన బిడ్డలుగా చెప్పుకుంటున్న తీరుగా రేవంత్ వ్యవహారం ఉన్నదని, మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడమే ఇందుకు నిదర్శనమని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మూడు నెలల్లోనే నోటిఫికేషన్ ఎప్పుడు ఇచ్చారో, పరీక్షలు ఎప్పుడు నిర్వహించి, ఫలితాలు ఎప్పుడు వెల్లడించారో చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ల ద్వారా ఎంపికైనవారిని తమ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా 1.60 లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని వివరించారు.



శామీర్‌పేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### రైతు రుణమాఫీ చేసింది బీఆర్ఎస్సే

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయాలేదంటూ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ఖండించారు. ఈటల ఆర్థికమంత్రిగా ఉన్న సమయంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్లు, మరో దఫాలో రూ.14 వేల కోట్లు మాఫీ చేసిందని గుర్తుచేశారు. తాము రైతుల రుణాలను మాఫీ చేస్తే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం పదేండ్లలో కార్పొరేట్ శక్తులకు రూ.14.30 కోట్ల రుణాలను మాఫీ చేసిందని విమర్శించారు. కేంద్రంలో పదేండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి చేయకుండా జైశ్రీరాం నినాదంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. యాదగిరిగుట్టను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తీర్చిదిద్దామని, దీనిపై తాము ఎలాంటి ప్రచారం చేసుకోలేదని చెప్పారు. మతపరమైన రాజకీయాలు చేయొద్దని బీజేపీకి హితవు చెప్పారు. అసలైన సెక్యులర్ పార్టీ అంటే బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసే అవసరం తమకు లేదని, కాంగ్రెస్ నాయకులే కూలదోసుకుంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే మానవబాంబులు ఉన్నారన్న విషయాన్ని రేవంత్ గుర్తించాలని చురకలేశారు. సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మాదిగల వ్యతిరేక పార్టీ

**నేటి నుంచి కాంగ్రెస్‌పై మాదిగల జంగ్**

- పది రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- 70 లక్షల మాదిగలకు ఒక్కసీటు ఇవ్వరా?
- సీఎం సామాజికవర్గానికే అత్యధిక సీట్లు
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ




ఖైరతాబాద్, ఏప్రిల్ 2: రాష్ట్రంలో 70 లక్షల మంది మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఈసారి ఒక్క లోక్‌సభ స్థానం కూడా కేటాయించకుండా మాదిగల వ్యతిరేక పార్టీగా మారిందని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ధ్వజమెత్తారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు సైతం కాంగ్రెస్ అన్యాయం చేసిందని, కేవలం రెండు సీట్లకే పరిమితం చేసిందని విమర్శించారు. ఐదు శాతం జనాభా కూడా లేని సీఎం రేవంత్‌రెడ్డి సామాజికవర్గానికి మాత్రం 50 శాతం టికెట్లు కేటాయించుకున్నారని ఆరోపించారు. మాదిగలు, బీసీలకు సీట్ల విషయంలో చేసిన అన్యాయంపై బుధవారం నుంచి 10 రోజులపాటు గ్రామ స్థాయి నుంచి పట్టణాలు, నగరాల్లో మాదిగలంతా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, తమతోపాటు బీసీలను కలుపుకొని పోతామని తెలిపారు. వరంగల్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్ ఎస్సీ రిజర్వుడ్ స్థానాల్లో 15 లక్షల మంది ఉన్న మాలలకు రెండు, ఒక్క శాతం మంది ఉన్న బైండ్ల కులానికి ఒకటి కేటాయించారని, దీంతో కాంగ్రెస్‌కు మాదిగలతో తెగతెంపులు జరిగినట్టేనని స్పష్టం చేశారు.

### కడియ కూతురుకు టికెట్ ఎలా ఇస్తారు?

వరంగల్ స్థానాన్ని అయినా మాదిగలకు ఇస్తారనుకుంటే బైండ్ల సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తెకు ఇవ్వడం మరింత బాధించిందని తెలిపారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పార్టీ మారితే కష్టకాలంలో పార్టీలు మారడం సిగ్గుచేటని, ఎవరైనా ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి మారితే రాళ్లతో కొట్టండని నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో మాట్లాడిన రేవంత్‌రెడ్డి నేడు బీఆర్ఎస్ కష్టకాలంలో ఉన్నప్పుడు కడియం శ్రీహరిని ఎందుకు చేర్చుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు.



పెద్దపల్లి జిల్లా మంథనిలో పోచమ్మవాడకు చెందిన రైతు మల్లయ్యను ఓదార్చుతున్న బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

## రైతుల ఆత్మహత్యకు కారణం కాంగ్రెస్సే

- బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

మంథని, ఏప్రిల్ 2 : రాష్ట్రంలో 200 మంది రైతుల ఆత్మహత్యకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో ఎండిపోయిన పంట పొలాలను జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండిన పంటలను చూసి రోదిస్తున్న రైతులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు రైతులను రోడ్డున పడేసిందని అన్నారు. యాసంగిలో సాగు నీరు కోసం రైతులు రోడ్డెక్కినా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం రావడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా సాగునీరు విడుదల చేసి, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల పరిహారం అందించాలని, ధాన్యానికి రూ.500ల బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## రేపు కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో నీటి వినియోగానికి సంబంధించి కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) త్రిమెన్ కమిటీ రేపు (గురువారం) ప్రత్యేకంగా సమావేశం కానున్నది. ఈ మేరకు బోర్డు ఇరు రాష్ట్రాలకు సమాచారం ఇచ్చింది. కమిటీలో బోర్డు మెంబర్ సెక్రటరీ, ఇరు రాష్ట్రాలు ఈఎన్సీలు సభ్యులుగా ఉంటారు. త్రిసభ్య కమిటీ గత అక్టోబర్‌లోనే సమావేశమై రెండు రిజర్వాయర్లలో దాదాపు 82కి పైగా టీఎంసీలు అందుబాటులో ఉన్నాయని నిర్ధారించింది. అందులో ఏపీకి 45, తెలంగాణకు 35 టీఎంసీలను కేటాయించింది. మిగిలిన 2 టీఎంసీలను మే నెల తర్వాత భవిష్యత్ అవసరాలకు వినియోగించాలని తెలిపింది. అయితే, తెలంగాణ ఇప్పటికే కోటాకు మించి నీటిని వాడుకున్నది. కాగా, ఏపీ తన కోటాలో 42 టీఎంసీలను వినియోగించుకోగా, మరో 3 టీఎంసీలు మిగిలి ఉన్నాయి. తాజాగా ఏప్రిల్‌లో మరో 5 టీఎంసీలను విడుదల చేయాలని ఇటీవల ఆంధ్రప్రదేశ్ కేఆర్ఎంబీకి లేఖ రాసింది. కోటాకు మించి 2టీఎంసీలను కోరుతున్నది. ఈ నేపథ్యంలో త్రిమెన్ కమిటీ ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు తెలుస్తున్నది.



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కూరపాటి రమేశ్

## సర్కారుపై నేతన్నల పోరుబాట

- ఈ నెల 6న సిరిసిల్లలో గర్జన
- ఐక్యవేదిక సమావేశంలో నిర్ణయం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించడంలో మొండివైఖరి అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై నేతన్నలు పోరుబాటకు సిద్ధమయ్యారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 6న సిరిసిల్లలో నేతన్నల గర్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ నాయకులు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వస్త్ర వ్యాపార సంఘం భవనంలో పరిశ్రమ అనుబంధ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కారదర్శి కూరపాటి రమేశ్ మాట్లాడుతూ.. బతుకమ్మ చీరల బకాయిలు రూ.270 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. నేతన్నల సమస్యలు పరిష్కారానికి రాజకీయాలకతీతంగా ఐక్యవేదిక (జాయింట్ యాక్షన్‌టీం)ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేతన్న బీమా, యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్ కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిరిసిల్ల టెక్స్‌టైల్స్ జోన్ ప్రెసిడెంట్ మంచె శ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, తెలంగాణ పవర్‌లూం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, నాయకులు పంతం రవి, కోడం రమణ పాల్గొన్నారు.

## మాదిగ గొంతుకపై కాంగ్రెస్ వేటు

- కాంగ్రెస్ నుంచి బక్క జడ్సన్ ఔట్
- ఆరేండ్లపాటు సస్పెన్షన్
- పార్టీ క్రమశిక్షణ కమిటీ ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బక్క జడ్సన్‌పై బహిష్కరణ వేటు పడింది. ఆయనను ఆరేండ్లపాటు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. కాంగ్రెస్ నాయకులకు కాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఎంపీ టిక్కెట్లు ఇస్తున్నారన్న బక్క జడ్సన్ వ్యాఖ్యలను క్రమశిక్షణారాహిత్యంగా అధిష్ఠానం భావించింది. ఆయన వ్యాఖ్యలపై సంజాయిషీ కోరుతూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజు నోటీసు జారీచేసింది. దీనికి జడ్సన్ ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని క్రమశిక్షణా కమిటీ ఆయనను పార్టీ నుంచి ఆరేండ్ల పాటు బహిష్కరిస్తున్నట్టు పేర్కొంది. దీనిపై 'ఎక్స్' వేదికగా జడ్సన్ స్పందిస్తూ.. 1989 నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్నందుకు సరైన గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. తనకు మద్దతునిచ్చిన రాహుల్‌గాంధీ, ప్రియాంకాలకు ధన్యవాదాలు తెలుపుతూ నే తెలంగాణలో అసలైన కాంగ్రెస్ కార్యకర్తలను భక్షిస్తున్న తోడేలుకు నాయకత్వాన్ని అప్పగించారని వ్యాఖ్యానించారు.

### ఈటలపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు బక్క జడ్సన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో ఈటల రాజేందర్ బాధితులు మాట్లాడుతుండగా, ఆయన పంపించిన గూండాలు దళిత యువకులపై దాడి చేశారని ఆరోపించారు. ఈటల ప్రోద్బలంతో జరిగిన ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, అందులో నుంచి ఆయన పేరును తొలగించారని, ఈటలను ఏ-1గా చేర్చాలని జడ్సన్ డిమాండ్ చేశారు.

## రాత్రి కరెంటుకు రైతు బలి

### పాము కాటుతో యువ రైతు మృతి




మృతి చెందిన కుంజా శివ(ఫైల్)

పెనుబల్లి, ఏప్రిల్ 2: కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి వేళాపాలా లేని కరెంటు ఇవ్వడం వల్ల విద్యుదాఘాతం, విషపురుగుల బారిన పడి రైతులు మృత్యువాత పడుతున్నారు. తాజాగా ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పార్థసారథిపురంలో రాత్రి వేళ విద్యుత్తు మోటర్ బంద్ చేయడానికి పొలం వద్దకు వెళ్లిన ఓ యువ రైతు పాము కాటుకు గురై మృతిచెందాడు. గ్రామానికి చెందిన యువ రైతు కుంజా శివ(30) తనకున్న నాలుగెకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పంటకు నీరందించే విద్యుత్తు మోటర్‌ను బంద్ చేసేందుకు పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ మోటర్ ఆఫ్ చేస్తుండగా శివను పాము కాటేసింది. అనుమానం వచ్చిన శివ సెల్‌ఫోన్ లైట్ ఆధారంగా చుట్టుపక్కల వెతకగా.. రక్తపింజర పాము కనిపించింది. వెంటనే దానిని చంపేశాడు. శివ ఇంటికి వస్తుండగా స్పృహతప్పి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. శివ ఎంతకూ ఇంటికి రాకపోవడంతో.. మంగళవారం తన మేనకోడలు పెండ్లి ఉండటంతో అక్కడికి వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. పెండ్లి కుమార్తె ఇంటికి వెళ్లి ఆరా తీయగా.. అక్కడికీ రాలేదని చెప్పారు. పొలం వద్ద ఉన్నాడనే అనుమానంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్తుండగా మార్గమధ్యంలో శివ మృతిచెంది కనిపించాడు. మృతుడు శివకు భార్య, కూతురు ఉన్నారు. శివ మృతి విషయమై కుటుంబ సభ్యులు సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు.

**2023 నాడు** | **దిగువ మానేరు దిగులు** | **2024 నేడు**





కరీంనగర్ శివారులోని దిగువ మానేరు జలాశయం బీఆర్ఎస్ పాలనలో ఏ సీజన్‌లో చూసినా నిండా నీటితో కళకళలాడుతూ ఉండేది. ఎస్సారెస్పీ దిగువ ఆయకట్టుకు అనుసంధానంగా ఉన్న ఈ జలాశయం 24 టీఎంసీల సామర్థ్యం కాగా, కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎండాకాలంలోనూ 10 టీఎంసీలకు తగ్గకుండా ఉండేది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత జలాశయంలో 5 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం నీళ్లు లేక అడుగంటి ఖాళీగా కనిపిస్తోంది. మరో రెండు నెలలు ఎండలు ముదిరితే కరీంనగర్ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తప్పవన్న అనుమానాలు వస్తున్నాయి. -స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్

### ఒక్క బిందె నీళ్లు.. 2 గంటలు



తుంగభద్ర నదీ తీరంలో చెలిమెల్లో బొట్టు బొట్టు నీటిని ఒడిసి పట్టుకుంటున్న వీరంతా జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కేశవరం గ్రామస్తులు. 466 నివాస గృహాలు, 2,060 జనాభా ఉన్న ఈ గ్రామంలో మిషన్ భగీరథ నల్లా నీరు ప్రతి రోజూ ఐదు నుంచి 10 నిమిషాలు మాత్రమే వస్తున్నది. దీంతో నీటి కోసం గ్రామస్తులు సుమారు 2 కిలోమీటర్లు బిందెలు పట్టుకొని నడిచివెళ్లి, ఏపీ సరిహద్దులోని తుంగభద్ర నదీతీరంలో ఇసుకను తవ్వి చెలిమెలా చేసి నీటిని పట్టుకుంటున్నారు. ఇలా ఒక్కో బిందె నిండడానికి సుమారు 2 గంటల సమయం పడుతున్నదని స్థానికులు వాపోయారు. దీంతో తెల్లవారుజాము నుంచే నదిలో నీటి కోసం బారులుదీరుతున్నారు. - అయిజ రూరల్, ఏప్రిల్ 2

### సీఎం నియోజకవర్గంలో రోడ్డెక్కిన మహిళలు



సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని వాల్యానాయక్ తండాలో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. దీంతో మంగళవారం ఖాళీ బిందెలతో రోడెక్కి తండావాసులు నిరసన తెలిపారు. - మద్దూర్ (కొత్తపల్లి), ఏప్రిల్ 2

# కాగితాల్లోనే నీళ్లు.. కాలువల్లో లేవు

- అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల వైఫల్యం
- గతి తప్పిన ప్రాజెక్టు నీటి ప్రణాళికలు
- కరువు కోరల్లో శ్రీరాంసాగర్ ఆయకట్టు
- వేలాది ఎకరాల్లో ఎండిన వరి పంట
- పశువుల పాలవుతున్న పంట చేన్లు



### ఆరెకరాలు ఎండిపోయింది

పోయిన ఏడాది లెక్కనే ఇప్పుడు ఉంటదని అనుకున్న. కేసీఆర్ ఉన్నప్పుడు మాకు నీరు పుష్కలంగా ఉండేది. అదే ధీమాతో మా భూమితో పాటు కౌలుకు తీసుకొని వరి వేసిన. కానీ కాంగ్రెస్ సర్కారు వరద కాలువను అశ్రద్ధ చేయడంతో నీరు లేకుండా పోయింది. ఆరెకరాల పంట ఎండిపోయింది. కాళేశ్వరం కూలిపోయిందని కథలు చెప్పుకుంట పబ్బంగడుపుతున్నరు కానీ మా రైతుల గోస పట్టించుకుంట లేరు.

- గుగులోతు బన్సీ నాయక్, భూషణ్‌రావుపేట, కథలాపూర్ మండలం, జగిత్యాల జిల్లా

కరీంనగర్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): పదేండ్లుగా పచ్చని పంటలతో అలరారిన శ్రీరాంసాగర్ ఆయకట్టు కాంగ్రెస్ పాలనలో కరువు కోరల్లో చిక్కుకున్నది. నిరుటి వరకు ఏ చీకూ చింత లేకుండా ఏడాదికి రెండు పంటలు తీసుకున్న రైతుల కండ్లల్లో ఇపుడు కన్నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో ప్రతి కాలువ కింద ఎండిన పంటలే దర్శనమిస్తున్నాయి. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా పాలకుల అవగాహనరాహిత్యానికి అధికారుల నిర్లక్ష్యంతోడవడంతో చేతికొచ్చిన పంటలు చేజారిపోయాయని రైతులు వాపోతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని డిస్ట్రిబ్యూటరీల పరిధిలో 'ఎండని చేను లేదు.. ఏడ్వని రైతు లేడు' అన్నచందంగా పరిస్థితి తయారైంది.

### నీటి ప్రణాళికకు నీళ్లొదిలారు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో అన్ని డిస్ట్రిబ్యూటరీల పరిధిలో నీటిని విడుదల చేసేందుకు ప్రతి సీజన్‌లో నీటి పారుదల శాఖ అధికారులు ప్రణాళికలు చేస్తారు. ఈ యాసంగిలో కూడా ప్రాజెక్టులో నీటి లభ్యతను బట్టి 2023 డిసెంబర్ 13న నీటి ప్రణాళికను అధికారులు ఖరారు చేశారు. ఆ సమయానికి ప్రాజెక్టులో 77.43 టీఎంసీల నీరు ఉంది. ఈ మేరకు దాదాపు 94 డిస్ట్రిబ్యూటరీలకు 64.18 టీఎంసీల నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. నీటి విడుదల కోసం డీ1 నుంచి డీ 53 వరకు జోన్-1గా, డీ 54 నుంచి డీ94 వరకు జోన్-2 విభజించుకున్నారు. జోన్-1కు 3,500 క్యూసెక్కుల చొప్పున 7 రోజులు, జోన్-2కు 5,500 క్యూసెక్కుల చొప్పున 8 రోజుల పాటు సీజన్ మొత్తంలో 105 రోజులు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా జోన్-1 పరిధిలో నిరుడు డిసెంబర్ 18న, జోన్-2 పరిధిలో డిసెంబర్ 25న నీటిని విడుదల చేశారు. ఒక్కో జోన్‌కు 7 విడతల్లో నీటిని ఇచ్చారు. ఏప్రిల్ 6 వరకే నీటిని విడుదల చేయాలనేది అధికారుల ప్రణాళిక. అయితే ఈ ప్రణాళిక ఎక్కడా సరైన రీతిలో అమలు కాలేదని, అనుకున్న విధంగా నీటిని విడుదల చేయలేదని రైతులు వాపోతున్నారు.

### ఎండిపోతున్న పంటలు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని ప్రతి డిస్ట్రిబ్యూటరీ కింద వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. నీళ్లు రాకనే తమకీ పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. కాకతీయ ఎగువ కాలువకు జోన్-1కు 3,500 క్యూసెక్కులు, జోన్ 2కు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లయితే పూర్తి స్థాయిలో పంటలు చేతికి వచ్చేవని రైతులు అంటున్నారు. అయితే ఇచ్చిన నీటిపై అజమాయిషీ లేకపోవడంతో మొదటి డిస్ట్రిబ్యూటరీల రైతులే వాడుకున్నారని, చివరి ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. చివరి ఆయకట్టుకు నీళ్లు అందించేందుకు అధికారులు ఎంత మాత్రం ప్రయత్నించలేదని వారు వాపోతున్నారు. దీంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి, రైతులు పశువులను మేపుకుంటున్నారు.



జాఫర్‌ఖాన్‌పేట-ఇద్లాపూర్ మధ్య సాగు నీళ్లు లేక బోసిపోతున్న ఎస్సారెస్పీ కాలువ

## క్రేన్ డబ్బా మీద పడి ఒకరి మృతి



రవి (ఫైల్)

నర్సింహులపేట/కేసముద్రం, ఏప్రిల్ 2: వ్యవసాయ బావిలో పూడిక తీస్తుండగా క్రేన్ వైరు తెగి మట్టితో ఉన్న డబ్బా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని నర్సింహపురం బంజర గ్రామ పంచాయతీ పరిధిలోని బయ్యా వెంకన్న వ్యవసాయ బావిలో పూడిక తీస్తున్నారు. ఈ క్రమంలో క్రేన్ వైరు తెగి మట్టి డబ్బా బావిలో ఉన్న గుగులోత్ రవి(40)పై పడింది. రవి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై సతీశ్ తెలిపారు.

### మట్టి కూలి రైతులకు గాయాలు

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లికి చెందిన పోతకం సుధాకర్ జేసీబీతో కొత్తబావి తవ్విస్తున్నాడు. 20 ఫీట్ల లోతు తీసిన తర్వాత బండ వచ్చే అవకాశమున్నదని జేసీబీ ఆపరేటర్ చెప్పాడు. బావి లోపల పరిశీలించేందుకు పెద్దమోరి తండాకు చెందిన మరో రైతు నరేశ్‌తో కలిసి సుధాకర్ లోపలికి దిగాడు. ఈ క్రమంలో పైనుంచి భూమి కూలి లోపల ఉన్న సుధాకర్, నరేశ్‌లపై పడింది. పక్కనే ఉన్న రైతులు వచ్చి వారిద్దరిని బయటకు తీసి చికిత్స కోసం మహబూబాబాద్ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై వంశీధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. లోతు ఎక్కువగా తీసి వెడల్పు తీయకపోవడం వల్లే ఇలా జరిగిందని రైతులు చర్చించుకుంటున్నారు.